క్లుప్తంగా

పశువులకు టీకాలు



ఎర్రగుంట్లలో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

బండి ఆత్మకూరు: మండలంలోని ఎర్రగుంట్ల, మణికంఠపురం, రామాపురం గ్రామాల్లో వెలుగోడు సహాయ సంచాలకులు డాక్టర్ ఏ.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు మండల పశుసంవర్ధక విభాగ అధికారులు డాక్టర్ అనూష, జ్యోత్స్నదేవి తెలిపారు. పశువులను వ్యాధుల నుంచి రక్షించుకోవాలంటే రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించాలని వారు సూచించారు.

దోమల నివారణకు చర్యలు



పిచికారీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్మికులు దోమల నివారణ చర్యలు చేపట్టారు. మురుగు కాలువలు, ఖాళీ ప్రదేశాలు, కుంటలు, వర్షపునీరు నిలువ ఉన్న చోట, చేతిపంపుల వద్ద, కుళాయి గుంతల వద్ద దోమల మందును పిచికారీ చేశారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి అరుణబాయి ప్రజలకు సూచించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వెలుగోడు: రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత మక్బుల్ బాషా, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఎస్ మొయినుద్దీన్, నరసింహులును మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మంనాయక్, హెచ్ఎం మాలిక్‌ఖాన్ పాల్గొన్నారు.

పంట నమోదు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏఓ పవన్ కుమార్

బండి ఆత్మకూరు: పంట నమోదు త్వరగా పూర్తిచేయాలని ఏఓ పవన్ కుమార్ రైతు సేవా సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం రైతు సేవ సిబ్బందితో ఏఓ సమావేశమై పలు సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్ పంటల నమోదు ఈనెల 30లోపు పూర్తి చేయాలన్నారు. రైతులకు నానో ఎరువులపై అవగాహన కల్పించి, వాటిని వాడే విధంగా చూడాలన్నారు.

హిందుత్వమంటే ఆత్మ విజ్ఞాన మార్గం



ధార్మిక ప్రవచనములు బోధిస్తున్న డాక్టరు మల్లు వెంకటరెడ్డి

నందికొట్కూరు: హిందుత్వమంటే ఆత్మ విజ్ఞాన మార్గమని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టరు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం సాయిబాబా ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ధార్మిక కార్యక్రమాలు ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. అనంతరం తితిదే ప్రచార సభ్యులు బలరామాచార్య చేసిన ధార్మిక ప్రవచనములు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ధార్మిక సంఘం సభ్యులు గణేష్, ఓంకారమయ్య, రాజశేఖర్, వెంకటశేషయ్య, శివశంకర్‌రెడ్డి, ఆలయ అర్చకులు నరసింహులు, శేషస్వామి పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య

పగిడ్యాల: 2025–26 విద్యా సంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులలో చేరిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య సూచించారు. మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, లేదా అని విద్యార్థులను ఆరా తీశారు. ఆమె వెంట మండల విద్యాశాఖ అధికారి సుభాన్, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న ఉన్నారు.

ఓజోన్ పొరతోనే మానవ మనుగడ సాధ్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

నందికొట్కూరు: ఓజోన్ పొరతోనే మానవ మనుగడ సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగముని తెలిపారు. మంగళవారం కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజోన్ వల్ల కలిగే లాభనష్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. ఓజోన్ పొరను కాపాడుకోకపోతే అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తలాత పర్వీన్, శశిధరయ్య, పరిమళాదేవి, సుమలత పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం



చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వెలుగోడు: మానవ జీవన వైవిధ్య రక్షణతోపాటు సమస్త జీవరాసుల మనుగడ ఓజోన్ పొరతోనే సాధ్యమని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మాలిక్ ఖాన్ తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి ఓజోన్ పొర క్షీణతతో వాతావరణంపై పడే ప్రభావం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, రామకృష్ణ, మహబూబ్ బాషా, ఫైజుల పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఒక మొక్కనాటి సంరక్షించాలి



మాట్లాడుతున్న కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.పద్మావతిభాయి

ఆత్మకూరు: ప్రతిఒక్కరూ ఒక మొక్కనాటి సంరక్షించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.పద్మావతిబాయి సూచించారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఓజోన్ పొర పరిరక్షణపై విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓజోన్ పొర వాతావరణంలోని స్ట్రాటోస్పియర్ పైన ఉంటుందన్నారు. ఇది సూర్యుని నుంచి విడుదలయ్యే అతినీలలోహిత కిరణాల నుంచి మానవ మనుగడకు రక్షణ కవచంగా ఉంటుందన్నారు. అలాంటి ఓజోన్ పొర క్లోరో ఫ్లోరో కార్బన్స్ వల్ల క్షీణిస్తోందన్నారు. ఓజోన్‌పొరను రక్షించుకోవడానికి క్లోరో ఫ్లోరో కార్బన్స్ వాడకాన్ని తగ్గించుకోవడంతో పాటు మొక్కలు నాటి పెంచాలన్నారు. కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వల్ల, భూతాపం వల్ల, మోటార్ వాహనాలు, ఫ్రిజ్‌ల నుంచి వెలువడే కాలుష్య కారకాల వల్ల, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ వాయువులు, ఓజోన్ పొరను దెబ్బ తీస్తాయన్నారు. అడవులను పెంచడం వల్ల ఓజోన్ పొరను రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు క్రిష్ణ, విద్యాసాగర్, రామకృష్ణ రెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

పాములపాడు: విద్యుత్ సంస్థలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతులపై ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఐటీయూ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం విద్యుత్ సంస్థలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించిందన్నారు. అతి తక్కువ వేతనాలతో ఎక్కువ పని గంటలతో, భద్రత లేకున్నా విద్యుత్ ఉత్పత్తి సంస్థలలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు సంస్థలకు వెన్నెముకగా ఉన్నారన్నారు. ప్రభుత్వం వారి సేవా కాలాన్ని పరిగణనలోకి తీసుకుని పోస్టులలో వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వయసు పరిమితిని 50 ఏళ్లకు పెంచాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాజు, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వామన్న పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రవచనం



మురళి శతావధాని

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై తిరుపతికి చెందిన ఆయుదాల మురళి శతావధాని వారి శ్రీశైల వైభవంపై ప్రవచనం ఆకట్టుకుంది.

పెద్ద వాగుపై వంతెన నిర్మించాలి



పెద్దవాగును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొత్తపల్లి: శివపురం – లింగాపురం గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం డిమాండ్ చేశారు. మంగళవారం శివపురం వద్ద పెద్ద వాగు వరద ఉధృతికి దెబ్బతిన్న లోలెవెల్ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా వర్షాకాలంలో పెద్దవాగు ఉధృతంగా ప్రవహించి గిరిజన గూడేలతో కలిపి 13 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. వాగు దాటే క్రమంలో ఇద్దరు మృత్యువాత పడ్డారన్నారు. 20 ఏళ్ల నుంచి తాము వంతెన కోసం పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని లేనియెడలా ప్రజలతో కలిసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎన్ స్వాములు, నాయకులు ఎస్ సంజీవరాయుడు, ఎస్ దాసు, జి దాసు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

పగిడ్యాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ(జేఏసీ) పిలుపు మేరకు దీర్ఘ కాలిక సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ ఉద్యోగులు స్థానిక 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కోరుతూ దశలవారి ఉద్యమాలకు సిద్ధమయ్యామన్నారు. అందులో భాగంగా ఈనెల 22 వరకు ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు, సర్కిల్ ఆఫీస్ నుంచి కలెక్టర్ కార్యాయాల వరకు ర్యాలీలు నిర్వహించనున్నామనాన్రు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైన్‌మెన్ వెంకటేశ్వర్లు, జూనియర్ లైన్‌మెన్‌లు తిక్కస్వామి, చంద్రమౌళి, శ్రీనివాసులు, బి.బిచ్చన్న, ఆపరేటర్లు బాబు, నాగేశ్వరగౌడ్, ఫీల్డ్‌అసిస్టెంట్ గుంపుల బిచ్చన్న పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు: అనుమతుల్లేని లేఅవుట్ల యజమానులు, అనుమతులు లేని ప్లాట్లు కొనుగోలు చేసిన వారు లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌ను (ఎల్ఆర్ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం జైకిసాన్ పార్కులో పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. లేఅవుట్లకు, ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చేయించుకుంటే నీళ్లు, విద్యుత్, రోడ్ల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అనుమతులు లేకుండా లే అవుట్లు వేసి ప్రభుత్వ ఖాజానాకు గండికొట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ పరిధిలో 7 సెంట్ల వరకు అనుమతి ఇచ్చే అధికారం ఉందని, కమర్షియల్ నిర్మాణాలకు అనుమతులిచ్చే అధికారం లేదన్నారు. పంచాయతీ పరిధిలో 15 సెంట్లలో ఇంటి నిర్మాణాలు, కల్యాణ మండపాలు నిర్మించారని, అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ బీబీ, కుడా ప్లానింగ్ అధికారి విజయభాస్కర్, సిటీ ప్లానర్ హాయత్‌మొద్దీన్, టీపీఓ రంగస్వామి పాల్గొన్నారు.

దళిత క్రైస్తవుల భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రాబిన్సన్ మాదిగ

ఆత్మకూరు: దళిత క్రైస్తవుల భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రాబిన్సన్ మాదిగ డిమాండ్ చేశారు. ఆయన ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, ముష్టపల్లె, సిద్ధపల్లె, క్రిష్ణాపురం, సిద్ధాపురం, వడ్ల రామాపురం, ఇందిరేశ్వరం గ్రామాల పొలిమేరలో అమెరికల్ బాపిస్టు మిషనరీ భూములు సుమారు 675 ఎకరాలు ఉన్నాయన్నారు. ఈ భూములను అగ్ర కులాల వారు ఆక్రమించి నిరుపేదలైన దళిత క్రైస్తవులకు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఏబీఎం మిషన్ భూముల అన్యాక్రాంతమవుతున్న ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశామన్నారు.

ఐటీఐలో 4వ విడత ప్రవేశాలకు దరఖాస్తు

డోన్ టౌన్ : జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు 4వ విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని 28వ తేదీ లోపు సమీప ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. 29న ఉదయం 9 గంటల నుంచి ప్రభుత్వ ఐటీఐల్లో, 30న ప్రైవేట్ ఐటీఐల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.వివరాలకు సమీప ప్రభుత్వ ఐటీఐల్లో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 10వ తేదీన జరిగిన ఎస్‌జీఎఫ్ ఆర్చరీ పోటీల్లో మాంటిస్సోరికి చెందిన 8వ తరగతి విద్యార్థిని పూజిత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలోని తన చాంబర్‌లో డైరెక్టర్ రాజశేఖర్ విద్యార్థినిని అభినందించారు. ఆమె వచ్చే నెల 8, 9 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పతకం సాధించాలని అకాంక్షించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

ఉయ్యాలవాడ : మండల కేంద్రం ఉయ్యాలవాడలో అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. ఎస్ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామక్కగారి సుశీలమ్మ(65) సోమవారం రాత్రి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరికి వివాహమైంది. ఈమె భర్త చిన్న సుబ్బారెడ్డి సుమారు 15 సంవ్సరాల క్రితం మృతి చెందాడు. కుమారుడు వెంకటసుబ్బారెడ్డి చెన్నైలో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు రోజులుగా సుశీలమ్మ ఇంటి తలుపు తీయకపోవడంతో చుట్టు పక్కల ఉన్న వారికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ రామిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించగా మంచంపై విగత జీవిగా పడి వుంది. ముక్కు, చెవులలో నుంచి రక్తం కారిన ఆనవాళ్లు కనిపించాయి. ఈ విషయాన్ని కుమారుడు, కుమార్తెకు తెలియజేయగా తమ తల్లి మృతిపై విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని సుశీలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ స్పష్టం చేశారు.

రైతులందరికీ యూరియా అందిస్తాం

నందికొట్కూరు: రైతులందరికీ యూరియా సరఫరా చేస్తామని ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. మంగళవారం మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా ప్రభుత్వం రైతులకు యూరియా ఇవ్వడం లేదని వ్యవసాయ అధికారులపై ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జలకనూర్ ఎంపీటీసీ హరిస్వరోత్తమరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదును దాటిన తర్వాత ఇచ్చినా ప్రయోజనం ఉండదని అన్నారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని రైతులందరికీ యూరియా ఇస్తున్నామని చెప్పడంతో ఎక్కడ ఇస్తున్నారో సమాధానం చెప్పాలని వారు ప్రశ్నించారు. రోడ్లు అధ్వానంగా మారినా పట్టించుకునే నాథుడే లేరని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో వైద్యశిబిరం



విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీవాణి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్‌లోని గిరిజన గురుకుల కళాశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కలుషిత నీటిని తాగడం వల్ల వైరల్ ఫీవర్లు వస్తాయని జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్. శ్రీవాణి విద్యార్థులకు సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. వైద్య శిబిరంలో సిబ్బంది సుబ్బరాయుడు, షాహీన్ సుల్తానా, రేణుక, అరుణ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం



మద్యం సీసాలు చూపుతున్న ఎస్ఐ మల్లికార్జున

జూపాడుబంగ్లా: మండలంలోని తర్తూరు గ్రామంలో మంగళవారం పోలీసులు మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో సిబ్బంది సోదాలు నిర్వహించగా తర్తూరు గ్రామానికి చెందిన ఈడిగ శ్రీనివాసులుగౌడు ఇంట్లో 35 క్వార్టర్ మద్యం సీసాలు లభ్యమయ్యాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని బెల్ట్‌షాపు నిర్వాహకుడు ఈడిగ శ్రీనివాసులుగౌడుపై కేసు నమోదు చేశామన్నారు.

గుండెపోటుతో రైల్వే ఎస్ఐ మృతి

డోన్‌టౌన్: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్‌నాయక్ (57) గుండె పోటుతో మృతి చెందారు. మంగళవారం గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త డోన్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అమృత్ స్టేషన్ పథకం పనుల పరిశీలనకు వచ్చారు. విధులకు హాజరైన ఎస్ఐ.. డీఆర్ఎం పర్యటన ముగిసిన తరువాత స్టేషన్‌కు వెళ్లే క్రమంలో మెట్లను ఎక్కబోతూ అకస్మాత్తుగా కిందపడి పోవడాన్ని గమనించిన రైల్వే సిబ్బంది రైల్వే ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారని సిబ్బంది తెలిపారు.



మృతి చెందిన ఎస్ఐ లక్ష్మణ్‌నాయక్

మొక్క ఎదుగుదలకు ఉపయోగం



నాగటూరులో జొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు,



రైతులను అవగాహన కల్పిస్తున్న ఏఓ స్వాతి

నందికొట్కూరు: మొక్క ఎదుగుదలకు నానో యూరియా ఎంతగానో ఉపయోగపడుతుందని డివిజన్ వ్యవసాయ సహాయక సంచాలకులు గిరీష్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నాగటూరు, కొణిదేల గ్రామాల పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా మొక్క ఎదుగుదలకు పని చేస్తుందన్నారు. ఒక బాటిల్ నానో యూరియాను నీళ్లలో కలిపి పంటకు పిచికారీ చేయాలన్నారు.

నానో యూరియాతో పంటలకు మేలు

వెలుగోడు: వరి పంటకు రెండో దఫాగా యూరియాకు బదులు నానో యూరియాను పిచికారీ చేసుకుంటే పంటలకు మేలు అని మండల వ్యవసాయాధికారిణి స్వాతి సూచించారు. మంగళవారం వేల్పనూరు గ్రామ పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరా పొలానికి 500 లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో నానో ఎరువుల వాడకం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

- జూపాడుబంగ్లా: యూరియాకు బదులుగా నానో యూరియా, డీఏపీలను వినియోగించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం 80బన్నూరు, పోతులపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ యూరియాను అధికమోతాదులో వినియోగించటం వల్ల భూసాంద్రత తగ్గే అవకాశం ఉందన్నారు. 45కిలోల బస్తా యూరియా వినియోగించటం వల్ల మొక్కలకు కేవలం 30 శాతం మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. లీటరు నానో యూరియాను పంటపై పిచికారీ చేయటం వల్ల 80 శాతం ఫలితం ఉంటుందన్నారు. ఖరీఫ్ పంటలను సత్వరమే ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు.

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్ర పారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. అనంతరం నందీశ్వర స్వామికి నూతన వస్త్ర సమర్పణ విశేషార్చనలను, నానబెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు



బయలు వీరభద్రస్వామి

పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి

- డీఎస్పీ రామాంజినాయక్



గ్రామ సభలో మాట్లాడుతున్న డీఎస్పీ

పాములపాడు: ఇటీవల సెల్ వినియోగం ఎక్కువైనందున పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. మంగళవారం రాత్రి ఎర్రగూడూరు గ్రామంలో పర్యటించి ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆన్‌లైన్ గేమ్స్, ఆన్‌లైన్ లోన్స్, యాప్స్, ఓటీపీ, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ గురించి వివరించారు. వాహనదారులు ఇన్సూరెన్స్, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జయంతి



ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: నవనారసింహులు కొలువైన అహోబిలంలో మంగళవారం శ్రీకృష్ణ జయంతి (ఉట్ల పండుగ)ను ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్యపూజల అనంతరం ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను కొలువుంచి నవకలశాలతో అభిషేకించి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం శ్రీ ప్రహ్లాదవరదుడిని శ్రీ కృష్ణుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవ మూర్తులను ఉత్సవ పల్లకీలో కొలువుంచి వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి కార్యక్రమం ముగించారు. ప్రధానార్చకులు కీడాంబి వేణుగోపాల్, మణియార్ సౌమ్యనారాయన్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.